క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కూకట్‌పల్లి: విద్యుత్ స్తంభం మార్పిడి కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్‌ను నిలిపివేయనున్నట్లు విద్యుత్ అధికారులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సౌత్ ఇండియా షాపింగ్ మాల్‌నుంచి భవ్యాస్ తులసీవనం ప్రాంతం వరకు రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ పోల్స్ మార్పిడి సందర్భంగా మాధవీనగర్ 11కె.వి. విద్యుత్ ఫీడర్ పరిధిలో సోమవారం ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ నిలిపి వేయనున్నారు. ఫీడర్ పరిధిలోని మాధవినగర్, నవోదయా కాలనీలో, శుభోదయా కాలనీ, కేబీఆర్‌నగర్, విజయనగర్ కాలనీ ప్రాంతాల్లో అదే విధంగా మైత్రినగర్ 11కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 4.30 నుంచి 4.50గంటల వరకు విద్యుత్ నిలిపివేయనున్నట్లు తెలిపారు.

సీసీరోడ్డు పనుల పరిశీలన



మాధవినగర్‌లో సమస్యలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సతీష్‌గౌడ్

బాలానగర్: ఫతేనగర్ డివిజన్ పరిధిలోని మాధవినగర్‌లో పలు సమస్యలు, చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులను స్థానికులు, సంబంధిత అధికారులతో ఆదివారం స్థానిక కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ పాదయాత్ర చేపట్టి తెలుసుకున్నారు. స్థానికుల అభ్యర్థన మేరకు సీసీ రోడ్డు పనులను జీహెచ్ఎంసీ రూ.30లక్షల నిధులతో చేపట్టామన్నారు. పాదయాత్రలో తెలుసుకున్న సమస్యలను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లి త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా రోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈ పవన్, ముకుందం, వెంకట్‌రెడ్డి, జగదీష్, బాగయ్య తదితరులు పాల్గొన్నారు.

జూన్ 4 నుంచి శ్రీపోచమ్మతల్లి కల్యాణ మహోత్సవాలు

మోతీనగర్: మూసాపేట కబీర్‌నగర్‌లోని శ్రీపోచమ్మ తల్లి కల్యాణ మహోత్సవాలు జూన్ 4 ఆదివారం నుంచి 6వ తేదీ మంగళవారం వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 4వ తేదీ ఉదయం 6గంటలకు సుప్రభాత సేవ, 7గంటలకు అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, సాయంత్రం 4.35 గంటలకు భక్తులు, కమిటీ సభ్యులు అందరూ కలిసి గంగా తెప్పకు బయలుదేరుట, 5వ తేదీ సోమవారం ఉదయం 7గంటలకు అమ్మవారికి అలంకరణ, 10.32 గంటలకు అమ్మవారి కల్యాణం, అనంతరం అన్నప్రసాద వితరణ, పట్నాలు, అగ్నిగుండాలు వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అదే విధంగా చివరిరోజు 6వ తేదీ మంగళవారం అమ్మవారి బోనాలు, సాయంత్రం 3గంటలకు తొట్టెల ఊరేగింపు వంటి కార్యక్రమాలు ఉంటాయి. ఈ కార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి అనుగ్రహం పొందాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించండి



విద్యుత్ సమస్యలను ఏఈలకు వివరిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో విద్యుత్‌కు సంబంధించిన సమస్యలపై డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ ఆదివారం సెక్షార్ ఎలక్ట్రికల్ ఏఈ శరత్ బాబు, భాగ్యనగర్ ఎలక్ట్రికల్ ఏఈ షేక్ షాబాజ్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో ఉన్న విద్యుత్ సమస్యలు, నూతన ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, కొత్త స్తంభాల ప్రతిపాదనలు, సింగిల్ ఫేజ్, థర్డ్ ఫేజ్ సమస్యలు, వేలాడుతున్న కరెంట్ తీగల సమస్యలపై చర్చించారు. సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, వెంకట్‌నాయక్, యడ్ల సత్యనారాయణ, వాసుదేవరావు, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాల వజ్రోత్సవాలకు సహకరిస్తాం

విజయనగర్‌కాలనీ: మాసబ్‌ట్యాంక్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వజ్రోత్సవాలకు సహకారం అందిస్తామని సాంకేతిక విద్యాశాఖ బోర్డు కార్యదర్శి ఆకుటి పుల్లయ్య తెలిపారు. మాసబ్‌ట్యాంక్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వజ్రోత్సవాలకు ఉన్నతాధికారులు సహకరించాలని ఇటీవల బాధ్యతలు చేపట్టిన పుల్లయ్యను మాసబ్‌ట్యాంక్‌లోని తన కార్యాలయంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు సురేష్‌ఆనంద్ కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సురేష్ ఆనంద్ మాట్లాడుతూ.. కళాశాల అభివృద్ధి, వజ్రోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు తాము చేస్తున్న కృషిని తెలిపారు.

మంత్రి దత్తత డివిజన్‌లో

జోరుగా అభివృద్ధి



హైదర్‌నగర్ డివిజన్‌లో కాలనీకే అందాన్ని తీసుకొస్తున్న అంతర్గత రహదారులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి సర్కిల్ హైదర్‌నగర్ డివిజన్ పరిధిలో మౌలిక సదుపాయాల కోసం పెద్దపీట వేస్తున్నారు. డివిజన్ పరిధిలోని ఎన్నో సమస్యలు ఉన్నా తక్షణమే పరిష్కరించే దిశగా ఇటు అధికారులు, అటు ప్రజా ప్రతినిదులు నిరంతరం కృషి చేస్తున్నారు. మంత్రి కేటీఆర్ దత్తత డివిజన్ కావటంతో ఇప్పటికే కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి డివిజన్ పరిధిలో ప్రజలకు ఎటువంటి సమస్యలు లేకుండా పరిష్కరించే దిశగా కృషి చేస్తున్నారు. అందులో భాగంగానే ప్రధానంగా అంతర్గత రహదారులతో పాటు ప్రధాన రహదారుల కోసం సుమారు రూ.50కోట్ల నిధులు వెచ్చించి అభివృద్ధి పనులను ఒకొక్కటిగా పూర్తి చేస్తున్నారు. రోడ్లను అభివృద్ధి చేయటం వల్ల ట్రాఫిక్ సమస్యను దృష్టిలో ఉంచుకొని అంతర్గత రోడ్లతో పాటు ప్రధాన రోడ్లను సైతం తీర్చిదిద్దుతున్నారు.

◆ 2014లో కార్పొరేషన్ ఎన్నికల్లో హైదర్‌నగర్ డివిజన్‌ను దత్తత తీసుకుంటున్నానని మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ప్రకటించారు. అనుకున్నదే తడవుగా అప్పటి నుంచి ఇప్పటి వరకు డివిజన్‌పై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి మౌలిక సదుపాయాలు కల్పించటంలో ముందువరుసలో ఉన్నారు.

◆ కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి అభివృద్ధి పనులు చేసి డివిజన్ అభివృద్ధికి తోడ్పాటునందిస్తున్నారు.



◆ ప్రధానంగా రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్‌ని దృష్టిలో ఉంచుకొని లింక్ రోడ్లుతో పాటు అంతర్గత రోడ్లను ఎప్పటికప్పుడు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి రోడ్లను నిర్మిస్తున్నారు.

◆ అందులో భాగంగానే ప్రధానంగా మియాపూర్ మెట్రో స్టేషన్ సమీపంలోని జాతీయ రహదారి నుంచి నిజాంపేట్ రోడ్డుకు సుమారు కిలోమీటర్ మేర రోడ్డును అనుసంధానించి మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ఇప్పటికే ప్రారంభించామన్నారు.

◆ అదే విధంగా నిజాంపేట్, మియాపూర్‌ల మధ్య వచ్చే వాహనాలు జాతీయ రహదారిపైకి వెళ్లేందుకు వీలుగా ఉంటుంది. దీంతో కొద్దిమేర నిజాంపేటలో ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టే అవకాశం ఉంటుంది.

◆ అదే విధంగా ఇప్పటికే ఆదిత్యానగర్, సమతా నగర్, అడ్డగుట్ట సొసైటీ, హెచ్ఎంటీ హిల్స్ వంటి ప్రధాన కాలనీల్లో ప్రత్యేక నిధులు వెచ్చించి రోడ్ల నిర్మాణం చేపట్టారు.

ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నాం..



హైదర్‌నగర్ డివిజన్ పరిధిలో ప్రజాప్రతినిధుల కోరిక మేరకు ప్రజల నుంచి వచ్చిన సమస్యలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో పర్యటించి అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభిస్తున్నాం. ఇప్పటికే హైదర్‌నగర్ డివిజన్ పరిధిలో కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి అంతర్గత రహదారులతో పాటు, ప్రధాన రహదారులను నిర్మించారు. ప్రజల రాకపోకలకు ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నాం. – ఏఈ రాజీవ్

ట్రాఫిక్ సమస్య లేకుండా రోడ్లను నిర్మిస్తున్నారు..



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన దగ్గర నుంచి గతంలో ఎన్నడూ జరగని అభివృద్ధిని ఈ ప్రభుత్వంలో చూశాం. హైదర్‌నగర్ డివిజన్‌లో ఏ కాలనీలో చూసినా అద్దంలా మెరిసిపోయే రోడ్లు దర్శనమిస్తున్నాయి. ఒకప్పుడు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి తమ కాలనీలోని రోడ్లను బాగు చేయండి మహాప్రభో అని వేడుకున్నా ఫలితం ఉండేది కాదు. ఈ ప్రభుత్వం హయాంలో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించటమే కాకుండా ట్రాఫిక్ సమస్య లేకుండా రోడ్లను నిర్మిస్తున్నారు. – నవీన్, శ్రీనివాస్‌నగర్ కాలనీ

ఘనంగా ఎన్టీఆర్ శత జయంతి వేడుకలు



వసంత్‌నగర్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీ నామా నాగేశ్వరరావు, మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, అరెకపూడి గాంధీ, కార్పొరేట్ శ్రీనివాసరావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గ జంట సర్కిళ్ల పరిధిలోని ఆదివారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు శత జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, అరెకపూడి గాంధీ, పలువురు కార్పొరేటర్‌లో తెలుగు దేశం పార్టీ నాయకులు, మిత్రపక్షాల నాయకులు పాల్గొని ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. తెలుగు ప్రజల ఔన్నత్యాన్ని ప్రపంచ నలుమూలల చాటిన గొప్ప మహానటుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. ఎన్టీఆర్ హయాంలోనే పేదలకు రెండు రూపాయల బియ్యం, జనతా వస్త్రాలను ప్రవేశపెట్టిన ఘనత ఆయనకే దక్కుతుందని తెలిపారు. తెలుగు ప్రజల గుండెల్లో ఆయన ఎప్పుడూ బతికే ఉంటారని అన్నారు. అప్పటి పటేల్, పట్వారి వ్యవస్థను కూకటివేళ్లతో పెకిలించి రద్దు చేసిన మహనీయుడని కొనియాడారు. ఆయన ముఖ్యమంత్రిగా పని చేసిన రోజుల్లో బడుగు, బలహీన వర్గాల కోసం అహర్నిశలు పాటుపడిన వ్యక్తి ఎన్టీఆర్ అని కీర్తించారు. తెలుగువారి కీర్తిని ప్రపంచానికి ఎలుగెత్తి చూపిన నాయకులు ఎన్టీఆర్ అని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు కృతజ్ఞతలు

● ఎన్టీఆర్ అభిమాన సంఘం నాయకులు

కూకట్‌పల్లి: విశ్వ విఖ్యాత నట సార్వభౌమ ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలు కూకట్‌పల్లిలో ఘనంగా నిర్వహించేందుకు పూర్తి సహాయ సహకారాలు అందించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు ఆదివారం ఎన్టీఆర్ అభిమానుల సంఘం కృతజ్ఞతలు తెలిపింది. ఈ సందర్భంగా సంఘం నాయకుడు పాతూరి గోపి మాట్లాడుతూ... కైత్లాపూర్‌లో అట్టహాసంగా జరిగిన ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలకు సైతం నిర్వాహకులు అడిగిన వెంటనే సభా ప్రాంగణం కోసం పూర్తి సహాయ సహకారాలు అందించనందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని పేర్కొన్నారు. అదే విధంగా ఎన్టీఆర్ అభిమానులు ఎప్పటి నుంచి వసంత్‌నగర్‌లో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని అనుకుంటూ ఎమ్మెల్యేని అడిగిందే తడవుగా తన పూర్తి సహాయ సహకారం అందించారని అన్నారు. స్వతహాగా ఎన్టీఆర్‌కి అభిమానిగా పేరు పొందిన ఎమ్మెల్యే కృష్ణారావు ఎన్టీఆర్ ఆశయ స్ఫూర్తితో పాటు ఆయన విధానాలను ఎప్పటికప్పుడు గుర్తు పెట్టుకుంటూ ముందుకు సాగటం అభినందనీయమన్నారు. ఎన్టీఆర్ అభిమానులుగా తమ అందరికి గర్వ కారణమని పాతూరి గోపి పేర్కొన్నారు. అదే విధంగా కేపీహెచ్‌బీ ప్రాంతంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఎన్టీఆర్ పేరు పెట్టడం పట్ల ఎన్టీఆర్ అభిమాన సంఘం తరపున ధన్యవాదాలు తెలుపుతున్నామని పేర్కొన్నారు.

వేడుకగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు



శ్రీవారి బ్రహ్మోత్సవంలో పాల్గొన్న బీజేపీ సీనియర్ నాయకురాలు విజయశాంతి

మోతీనగర్: ఆలయాలు మనస్సుకు ప్రశాంతతను, భక్తి భావం పెంపొందిస్తాయని మాజీ పార్లమెంట్ సభ్యురాలు, బీజేపీ సీనియర్ నాయకురాలు, ప్రముఖ సినీ నటి విజయశాంతి పేర్కొన్నారు. ఆదివారం అల్లాపూర్ డివిజన్ శ్రీ వివేకానందనగర్‌లో శ్రీ భూనీల సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మూడు రోజుల నుంచి కొనసాగుతున్నాయి. ఆదివారం ఈ బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఈ సందర్భంగా విజయశాంతి ముఖ్యఅతిథిగా పాల్గొని శ్రీవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పులిగొళ్ల శ్రీనివాస్ యాదవ్, సీనియర్ నాయకుడు వడ్డేపల్లి రాజేశ్వర రావు, శ్రీలక్ష్మీ యాదవ్, బొంతు హరికృష్ణ, చిలుకల కృష్ణారెడ్డి, ఏడుకొండలు, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా బాస్కెట్‌బాల్ పోటీలు



క్రీడాకారులతో ఓఎస్‌డీ లక్ష్మీ

వెంగళరావునగర్: యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో ఆదివారం చీఫ్ మినిస్టర్ కప్ – 2023 పేరుతో రెజ్లింగ్, బాస్కెట్‌బాల్ పోటీలు ప్రారంభమైన పోటీలు హోరాహోరీగా జరిగాయి. రాష్ట్రస్థాయిలో జరుగుతున్న ఈ పోటీలకు హైదరాబాద్ జిల్లాతో పాటు ఆదిలాబాద్, వనపర్తి, భద్రాద్రి కొత్తగూడెం, కరీంనగర్, వరంగల్, హన్మకొండ, మంచిర్యాల, సిద్దిపేట్, నిజామాబాద్, జోగులాంబ గద్వాల్, సూర్యాపేట, మహబూబ్‌నగర్, ఖమ్మం, మహబూబాబాద్, రంగారెడ్డి తదితర జిల్లాల నుంచి మహిళ, పురుష క్రీడాకారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. మహిళా విభాగంలో 5 నాకౌట్ మ్యాచ్‌లు జరిగాయి. హైదరాబాద్–వనపర్తి జట్ల మధ్య జరిగిన పోటీలో హైదరాబాద్ జట్టు విజయం సాధించింది. మేడ్చల్–భూపాల్‌పల్లి మ్యాచ్‌లో మేడ్చల్, రంగారెడ్డి–మహబూబాబాద్ మ్యాచ్‌లో రంగారెడ్డి, ఖమ్మం–మహబూబ్‌నగర్ మ్యాచ్‌లో ఖమ్మం, నిజామాబాద్–సూర్యాపేట మ్యాచ్‌లో నిజామాబాద్ క్రీడాకారులు విజయం సాధించారు. పురుషుల విభాగంలో ఆదిలాబాద్–వనపర్తి జట్ల మధ్య జరిగిన పోటీలో ఆదిలాబాద్, భద్రాద్రి–వికారాబాద్ మ్యాచ్‌లో భద్రాద్రి, సంగారెడ్డి–సిద్దిపేట్ మధ్య జరిగిన పోటీలో సంగారెడ్డి, జగిత్యాల్–జయశంకర్ భూపాల్‌పల్లి మ్యాచ్‌లో జగిత్యాల్,కామారెడ్డి–జోగులాంబ గద్వాల్ మ్యాచ్‌లో కామారెడ్డి, మహబూబ్‌నగర్–పెద్దపల్లి మ్యాచ్‌లో మహబూబ్‌నగర్, నల్లగొండ–కరీంనగర్ మ్యాచ్‌లో నల్లగొండ, నిజామాబాద్–మంచిర్యాల్ మ్యాచ్‌లో నిజామాబాద్, మహబూబాబాద్–ములుగు మధ్య జరిగిన పోటీలో మహబూబాబాద్ క్రీడాకారులు విజయం సాధించారు. అనంతరం ఏర్పాటు చేసి సమావేశంలో తెలంగాణా స్పోర్ట్స్ అథారిటీ ఓఎస్డీ లక్ష్మీ మాట్లాడుతూ ఈ నెల 31 వరకు క్రీడా పోటీలు కొనసాగుతాయని, క్రీడాకారులకు వసతి, భోజన సౌకర్యాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రంగారెడ్డి డీఆర్‌డీఓ ప్రభాకర్, సంగారెడ్డి డిప్యూటీ ఎస్‌ఓ రామచందర్, స్టేడియం ఇన్‌చార్జి జి.రవీందర్ పాల్గొన్నారు.

సైబర్ సెక్యూరిటీ కోర్సుల్లో దరఖాస్తులకు ఆహ్వానం

కాచిగూడ: సైబర్ సెక్యూరిటీ కోర్సుల్లో ఆన్‌లైన్‌లో శిక్షణ కోసం తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తిగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు నేషనల్ అకాడమీ ఆఫ్ సైబర్ సెక్యూరిటీ ఇండియా డైరెక్టర్ విమలారెడ్డి తెలిపారు. ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ డిప్లొమా అభ్యర్థులు ఆన్‌లైన్‌లో జూన్ 9లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. వివరాలకు సెల్: 7893141797 లేదా వెబ్‌సైట్: www.nacrindia.orfలో సంప్రదించాలని కోరారు.

డివిజన్ అభివృద్ధికి నిరంతర కృషి



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న లక్ష్మీ బాల్‌రెడ్డి

అమీర్‌పేట్: సనత్‌నగర్ డివిజన్ అభివృద్ధి కోసం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ నిరంతరం కృషి చేస్తున్నారని కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని బాలయ్య నగర్‌లో మంత్రి చొరవతో మంజూరైన రూ. 21 లక్షలతో వీడీసీసీ రోడ్డు పనులను ఆదివారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. గత ప్రభుత్వాలు సనత్‌నగర్ డివిజన్‌ను పట్టించుకోకపోవడంతో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తరువాత మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కృషితో సనత్‌నగర్ అభివృద్ధి కోసం వందల కోట్ల నిధులు తీసుకువచ్చి అభివృద్ధికి బాటలు వేశారన్నారు. తెలంగాణ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని అభివృద్ధి పథకాలను అమలు చేసే ప్రభుత్వం అన్నారు. ప్రజల సహకారంతో సనత్‌నగర్ డివిజన్ అభివృద్ధి కోసం తాను నిరంతరం శ్రమిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బాల్‌రెడ్డి, సురేష్, వెంకన్న, ఈశ్వర్, అంజయ్య, నర్సింహగౌడ్, పురుశోత్తం, సురేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

జీర్ణ సమస్యలపై నిర్లక్ష్యం వద్దు

బంజారాహిల్స్: సాధారణ జీర్ణ సమస్యలను నివారించడానికి తల్లిదండ్రులు తమ పిల్లల పేగు ఆరోగ్యానికి ప్రాధాన్యతనివ్వాలని ఒమేగా క్లినిక్స్ కన్సల్టెంట్ పీడియాట్రిషియన్ డాక్టర్ కె. పవన్ కుమార్ అన్నారు. ప్రపంచ జీర్ణ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ పిల్లల్లో సాధారణంగా కనిపించే పేగు సమస్యలు మలబద్ధకం, హైపర్ ఎసిడిటి, డయేరియాతో ప్రభావితం అవుతుందన్నారు. మలబద్ధకం 30 శాతం మంది పిల్లలను ప్రభావితం చేస్తుందన్నారు. ఇది పిల్లల్లో కడుపు నొప్పికి కారణం అవుతుందన్నారు. దేశంలోని 22–25 శాతం మంది శిశువులను హైపర్ ఎసిడిటి ప్రభావితం చేస్తుందన్నారు. రోగ నిరోధక, జీవక్రియ, నరాల ప్రవర్తన లక్షణాలతో సహా మానవ ఆరోగ్యంపై పేగుల్లో సూక్ష్మ జీవులు కీలకమైనవన్నారు. అందుకే పిల్లల పేగుల ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవడం ముఖ్యమన్నారు. సమతుల్య ఆహారం తీసుకోవడంతో పాటు రోటా వైరస్, మీజిల్స్ వ్యాక్సిన్లతో సహా పిల్లలకు సరిగ్గా టీకాలు వేయడం ముఖ్యమని ఇది డయేరియాను నివారించడంలో భాగా సహాయ పడుతుందన్నారు. జీర్ణ సంబంధ సమస్యల లక్షణాలను గుర్తిస్తే వెంటనే పిల్లల డాక్టర్లను సంప్రదించాలని సూచించారు. పిల్లల ఆహారంలో ఎక్కువ ఫైబర్ ఉండటంలో చూడటంతో పాటు వారికి తల్లిపాలు ఇవ్వడం, కొవ్వు పదార్థాలను తగ్గించడం, ప్రో బయోటిక్‌లను ఎంచుకోవడం మంచిదన్నారు. తగినంత నీరు కూడా ఇవ్వాలన్నారు.బయటికి వెళ్లి ఆడుకునేలా ప్రోత్సహించాలన్నారు.

వార్డు కమిటీలున్నా.. లేనట్టే..!

పాలక యంత్రాంగం చిన్నచూపుతో దూరంగా కమిటీల సభ్యులు

● కమిటీల్లో విద్యావంతులు, ప్రజాసంబంధాలు ఉన్న వారికి చోటు
● ఒక వార్డుకు 4 కమిటీలు.. ఒక్కో కమిటీలో 15 మంది సభ్యులు
● శివారు 28 పురపాలికల్లో 2,560 వార్డు కమిటీలు.. 38,400 మంది సభ్యులు
● వార్డు కమిటీలకు అవగాహన కల్పించేందుకు కృషి చేయాలి

సాక్షి, మేడ్చల్ జిల్లా: పట్టణాభివృద్ధికి పెద్దపీట వేస్తూ ప్రభుత్వం, పాలకవర్గం, అధికార యంత్రాంగం, పట్టణవాసులను భాగస్వామ్యం చేస్తూ.. 2020 ఏప్రిల్లో పురపాలికల్లో వార్డు కమిటీలను ఏర్పాటు చేసింది. ప్రజలతో సంబంధం కలిగిన ఉన్న వారికి, విద్యావంతులకు కమిటీలో చోటు కల్పించారు. వార్డుల్లో చేపట్టే అభివృద్ధి పనుల్లో వారి పాత్ర కీలకమనేది పాలకవర్గం, అధికారులు విస్మరించాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇదే తీరుగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం వేసవిలో పట్టణాల్లో మురుగు కాలువ పనులు, పూడికతీత, ముళ్లకంపల తొలగింపు, మురుగు మళ్లింపు తదితర పనులు చేపట్టారు. వీటిలో ఎక్కడా కమిటీల అభిప్రాయాన్ని తీసుకోలేదు. పట్టణాల్లో వ్యర్థాల నిర్వహణ, హరితహారం, పారిశుద్ధ్యం, నీటి సరఫరా, అక్రమ కట్టడాలు, అభివృద్ధి పనులు తదితర పనులు చేపట్టాల్సి ఉంటుంది.

శివారు పురపాలికల్లో 38,400 సభ్యులు

◆ నగర శివారుల్లోని మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని 28 పురపాలికల్లో 640 డిజన్లు/వార్డులు ఉండగా, ఇందులో 2,560 కమిటీలను నియమించారు. ఈ కమిటీల పరిధిలో 38,400 మంది సభ్యులు ఉన్నారు. కొత్త కమిటీ ఏర్పడి మూడేళ్లయ్యింది. ఒక వార్డుకు 4 కమిటీలు చొప్పున, ఒక్కో కమిటీలో 15 మంది సభ్యులతో కమిటీలు ఏర్పాటు చేశారు. ప్రధానంగా డివిజన్/ వార్డుల్లోని యువజన, వయోజన, ప్రముఖులు, మహిళలు ఇలా నాలుగు రకాల కమిటీలను తయారు చేశారు. పురపాలకవర్గాలు తమ ఇష్టం వచ్చిన వారిని ఎంపిక చేసి కమిటీలో చోటు కల్పించారు.



సమస్యలు ఇక్కడే..

◆ శివారు పట్టణాల్లో పన్నుల వసూళ్లపై ఉన్న శ్రద్ధ అభివృద్ధిపై చూపకపోవడంతో ప్రజలు పలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. వచ్చే వర్షాకాలంలో శివారు పురపాలికల్లో ప్రజలకు కష్టాలు తప్పవని తెలుస్తోంది. చిన్న పాటి వర్షం పడితే చాలు.. రోడ్లన్నీ చిత్తడిగా మారుతున్నాయి. ఎడతెరిపి లేకుండా వర్షం కురిస్తే.. లోతట్టు ప్రాంతాలు, మురికి వాడలు వరదమయంగా మారుతుండగా, రోడ్లన్నీ అస్తవ్యస్తంగా నడవలేని స్థితికి చేరుతుండటంతో పట్టణ ప్రజలకు బాధలు తప్పటం లేదు.

◆ శివారుల్లోని గ్రామ, నగర పంచాయతీల విలీనంతో పురపాలక సంఘాలుగా ఏర్పడ్డాయి. శివారుల్లోని అతిపెద్ద పట్టణం బోడుప్పల్లో 162 కాలనీలు ఉండగా, వివిధ పన్నుల ద్వారా ఏటా రూ.60 కోట్ల ఆదాయం వస్తున్నా.. ప్రజలు మాత్రం అంతర్గత రోడ్లు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, కాలుష్యంతో చెరువు నీటి దుర్వాసన, నీటి సరఫరా పైప్‌లైన్ల లీకేజీలు తదితర సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. మరో నగర పాలక సంస్థ పీర్జాదిగూడలో 80 కాలనీలు ఉండగా, ఏటా పన్నుల ద్వారా ఏటా రూ.30 కోట్ల ఆదాయం సమకూరినా ప్రజలు మాత్రం పలు సమస్యలతో బాధపడుతున్నారు. ఈ రెండు పట్టణాలకు మాత్రమే సమస్యలు పరిమితం కాలేదు. ఇలాంటి అధ్వాన్న పరిస్థితులు ఉన్న పట్టణాలు శివారు పరిధిలో మరో 4 నగర పాలక సంస్థలు, 23 మున్సిపాలిటీలు ఉన్నాయి. ఇక్కడ కూడా ప్రజల పలు సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

శివారు పురపాలికలివే..

◆ నగర శివారుల్లో బోడుప్పల్, పీర్జాదిగూడ, నిజాంపేట్, జవహర్‌నగర్, బడంగ్‌పేట్, మీర్‌పేట, బండ్లగూడ నగర పాలక సంస్థలు ఉండగా, దమ్మాయిగూడ, నాగారం, పోచారం, ఘట్కేసర్, గుండ్లపోచంపల్లి, తూముకుంట, కొంపల్లి, దుండిగల్, మేడ్చల్, పెద్ద అంబర్పేట్, తుక్కుగూడ, ఇబ్రహీంపట్నం, జల్పల్లి, షాద్‌నగర్, శంషాబాద్, శంకరపల్లి, తుర్కంజాల్, మణికొండ, నార్సింగి, ఆదిభట్ల, అమనగల్లు మున్సిపాలిటీలు ఉన్నాయి.

ఆదాయం ఉన్నా.. అభివృద్ధి అంతంతే..

◆ శివారు పట్టణాల్లో ముక్కుపిండి ఏటా వివిధ పన్నుల రూపేణా రూ.343 కోట్లు వసూలు చేస్తున్నా.. పురపాలికలు ప్రజలకు మాత్రం సేవలు అందించడంలో విఫలం అవుతున్నాయన్న విమర్శలు ఉన్నాయి. 15వ ఆర్థిక సంఘం ద్వారా కూడా ప్రతినెలా ఒక్కో పురపాలక సంఘానికి రూ.3 లక్షల నుంచి రూ.21 లక్షల నిధులు విడుదలవుతున్నాయి. పట్టణ ప్రగతితో కూడా పురపాలక సంఘాల ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోంది. ఈ నిధులన్నింటిని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులకు వెచ్చించాల్సి ఉన్నా, పట్టించుకోకపోవడంతో అభివృద్ధి రెండు అడుగులు ముందుకు.. మూడు అడుగులు వెనక్కి అన్న చందంగా ఉంది.

వార్డు కమిటీలకు విధులపై..

◆ వార్డు కమిటీలకు విధులపై అవగాహన కల్పించేందుకు పురపాలక యంత్రాంగం కృషి చేయాల్సిన అవసరం ఉంది. వారికున్న విధులేమిటి, ఏ పనులపై అజమాయిషీ ఉండాలనే విషయంపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని కోరుతున్నారు. వార్డు సభ్యులకు సేవా భావం ఉండేలా చైతన్యం, అవగాహన కల్పించడం ద్వారా పురపాలికల అభివృద్ధిలో భాగస్వామ్యం చేయాలని కోరుతున్నారు.